

ప్రభుత్వ ఆర్‌ఐటిఐలో స్వల్పకాలిక కోర్సులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి ఆర్‌ఐటిఐలో ప్రధానమంత్రి కౌశల్ వికాస యోజన పథకంలో భాగంగా మూడు నెలల అసిస్టెంట్ ఎలక్ట్రిషన్ స్వల్పకాలిక కోర్సులో ఉచితంగా మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్.సునీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అర్హులైన పదో తరగతి పాసైన 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్య వయసు కలిగి ఆసక్తిగల నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హత సర్టిఫికెట్లను నకలతో పాటు ఆధార్ కార్డు, ప్రస్తుత పాస్‌పోర్టు సైజు ఫోటోలతో స్థానిక ఆర్‌ఐటిఐలో దరఖాస్తులు అందజేయగలరని అన్నారు. శిక్షణ పూర్తయిన వెంటనే నైపుణ్యం తగ్గ ఉపాధి కల్పించనున్నట్టు తెలిపారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అగ్నివీర్‌కు సర్వం సిద్ధం

- 20 నుంచి ర్యాలీ ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి
- నేటి రాత్రికే అభ్యర్థుల హాజరు
- రోజుకు వెయ్యి మందికి అనుమతి
- 13 జిల్లాల నుంచి అభ్యర్థుల రాక

ఏర్పాట్లు చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అగ్నివీర్ ర్యాలీకి సర్వం సిద్ధమైంది. అగ్నిపథ్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ విజయనగరంలో తలపెట్టిన విషయం విదితమే. ఈ నెల 20న తెల్లవారుజాము నుంచే స్థానిక పోలీసు శిక్షణ కళాశాల మైదానంలో ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. శ్రీకాకుళం నుంచి కృష్ణా వరకు మొత్తం 13 జిల్లాల నుంచీ సుమారు 10 వేల మంది యువకులు ఈ ర్యాలీకి హాజరు కానున్నారు. ఇందుకనుగుణంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. ఆగస్టు 2 వరకు మొత్తం 14రోజులపాటు ఆర్మీ రిక్రూట్‌మెంట్ కొనసాగనుంది.

మొదటి రోజు హాజరు కావాల్సిన అభ్యర్థులు 19వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకల్లా పిటిసి గ్రౌండ్‌వద్ద సిద్ధంగా ఉండాలని అధికారులు స్పష్టంచేశారు. రాత్రి 12.30 గంటలకు గ్రౌండ్‌లోపలికి అనుమతిస్తారు. ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలన్న లక్ష్యంతో పలుచోట్ల సిసి కెమెరాలను అమర్చారు. ఆర్మీ ఉన్నతాధికారుల నిఘా, పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం సంపూర్ణ సహకారంతో ఫ్లడ్‌లైట్ల వెలుగుల మధ్య ఈ ర్యాలీ నిర్వహించనున్నారు. రాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారు మాత్రమే ర్యాలీకి హాజరుకావాలని అధికారులు స్పష్టంచేశారు. ఎంపిక ప్రక్రియ ప్రతిరోజూ రాత్రి 12.30 గంటలకు ప్రారంభం అవుతుంది. రోజుకు వెయ్యి మంది అభ్యర్థులు హాజరయ్యే విధంగా అధికారులు అడ్మిట్ కార్డులను జారీచేశారు.

ఏర్పాట్లు ఇవీ

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సెట్విజ్, పిటిసి, పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, రవాణా, వైద్య, డిఆర్‌డిఎ, విద్య, ఆర్ అండ్ బి, విద్యుత్, ఐఅండ్‌పిఆర్ తదితర శాఖలు ఈ ర్యాలీ ఏర్పాట్లలో భాగస్వాములు అయ్యాయి. తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను కల్పించారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని పరేడ్ గ్రౌండ్స్‌లో వాటర్ ప్రూఫ్ టెంట్లను ఏర్పాటు చేస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారు బస చేయడం కోసం యూత్ హాస్టల్, రాజీవ్ స్టేడియంలో నామమాత్రపు రుసుంతో వసతి సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. పరేడ్ గ్రౌండ్‌కు చేరుకొనేందుకు ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. రాత్రి 12 గంటలకు

సద్వినియోగం చేసుకోండి

రిక్రూట్‌మెంట్ కోసం పటిష్టమైన ఏర్పాట్లను చేశాం. జిల్లాకు చెందిన యువత అధిక సంఖ్యలో ఉద్యోగాలు సాధించాలని ఆశిస్తున్నాం. సాయుధ దళాల్లో చేరాలనుకొనే యువతకు ఈ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ చక్కని అవకాశం. ఇది దేశానికి సేవ చేసేందుకు మంచి అవకాశం. సైనిక దళాల్లో చేరినవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది.

- ఎస్.నాగలక్ష్మి, కలెక్టర్, విజయనగరం జిల్లా

ఎంపిక ప్రక్రియ ఇలా

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో భాగంగా తమకు కేటాయించిన నిర్ణీత తేదీకి అవసరమైన సర్టిఫికెట్లను తీసుకొని అభ్యర్థులు 30 నిమిషాల ముందు హాజరు కావాలి. అడ్మిట్ కార్డు, 20 కలర్ పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్, నోటిఫికేషన్‌లో పేర్కొన్న వివిధ సర్టిఫికెట్లను తీసుకురావాలి. అడ్మిట్ కార్డు, బార్‌కోడ్‌ను పరిశీలించి, వెయ్యి మందిని లోపలికి అనుమతిస్తారు. వీరిని రెండు బ్యాచ్‌లుగా విడదీస్తారు. అభ్యర్థులకు ముందుగా ఎత్తు కొలిచి, లోపలికి అనుమతించి, 1.6 కిలోమీటర్ల పరుగుపందెం నిర్వహిస్తారు. విడతకు వంద మంది చొప్పున పరుగు పందెం నిర్వహిస్తారు. ఈ దూరాన్ని ఐదున్నర నిమిషాల్లో పూర్తి చేసినవారికి 60 మార్కులు, 5.45 నిమిషాల్లో, ఆ లోగా పూర్తి చేసినవారికి 48 మార్కులు కేటాయిస్తారు. అంతకంటే సమయం దాటితే అనర్హులవుతారు. ఈ పరుగు పందెంలో ఉత్తీర్ణులైన వారికి మాత్రమే తదుపరి పరీక్షలకు అనుమతిస్తారు. ప్రతి అభ్యర్థీ కనీసం 6 పులప్స్ తీయాల్సి ఉంటుంది. 10 పులప్స్ తీస్తే గరిష్టంగా 40 మార్కులు, 9 తీస్తే 33, 8 తీస్తే 27, 7 తీస్తే 21, 6 పులప్స్ తీస్తే 16 మార్కులు వస్తాయి. ఆ తరువాత జిగ్‌జాగ్ నడక, 9 అడుగుల లాంగ్ జంప్ పోటీలు ఉంటాయి. ఈ రెండింటిలో కేవలం ఉత్తీర్ణులైతే సరిపోతుంది. అనంతరం అభ్యర్థులకు మరునాడు ఉదయం సర్టిఫికెట్లను తనిఖీ చేసి, వైద్య పరీక్షల అనంతరం తుదిజాబితా తయారు చేస్తారు. ప్రస్తుతం విస్తృతంగా వర్షాలు కురుస్తుండటంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేస్తున్నారు.

ఎంపిక ప్రక్రియకు హాజరయ్యే అభ్యర్థులు, అన్ని దశల్లోని పరీక్షలను విజయవంతంగా పూర్తి చేస్తే, మరునాడు సాయంత్రం గ్రౌండ్ నుంచి బయటకు వస్తారు. వీరికి అల్పాహారం, భోజనాన్ని కల్పించనున్నట్టు జిల్లా యంత్రాంగం చెబుతోంది.

వర్షంలోనూ ర్యాలీగా వెళ్తున్న ఆశా కార్యకర్తలు

వర్షాన్ని సైతం లెక్క చేయకుండా
సమస్యలపై కదంతొక్కిన ఆశాలు

ప్రజాశక్తి - బెలగాం

ఉదయం నుంచీ బోరున వర్షం పడుతున్నా లెక్క చేయకుండా సమస్యల పరిష్కారం కోసం ఆశా వర్కర్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి కథం తొక్కారు. వర్షం పడుతున్నా గొడుగులు వేసుకొని జిల్లా నలుమూలల నుంచి ఆశా వర్కర్లు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మంగళవారం నిర్వహించిన ఈ ధర్నానుద్దేశించి శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు వి.ఇందిర మాట్లాడుతూ ఆశా వర్కర్లతో సంబంధం లేని పనులు చేయించకూడదు, నాణ్యమైన సెల్‌ఫోన్ 4 జి సిమ్ ఇవ్వాలని, ఆన్‌లైన్ పనులు చేసేందుకు శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సెలవులు ఇవ్వాలి, మెడికల్ లీవు, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఎఎన్ఎం, ఎఎల్‌హెచ్‌పిల ఒత్తిడి ఆపాలని కోరారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6,7గంటల వరకు సబ్ సెంటర్లో ఉంటూ ఇతర 14 రకాల యాప్‌లను డౌన్లోడ్ చేసుకుని వాటి నుంచి పని చేయాలని 26 రికార్డులు రాయాలని ప్రభుత్వం దుర్మార్గంగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రికార్డ్‌లు సొంత డబ్బులు పెట్టి కొనాలని, సంబంధం లేని ఆన్లైన్ పనులు సొంత ఫోన్ల ద్వారా చేయాలని వేధిస్తున్నార న్నారు. సెలవుల్లేకపోవడంతో అనారోగ్యాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్లైన్ వర్క్ భారాన్ని తగ్గించాలని, ఆన్లైన్లో లేదా రికార్డు ఒక పని ఒక్కసారి మాత్రమే చేసేలా చూడాలని, రూ.10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని, రిజిస్టర్లు సంతకాలు చేయించడం ఆపాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి జగన్నాథ రావుకు వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు యూనియన్ నాయకులు ఎ.మాలతి, గౌరి, అప్పలనరసమ్మ, గంగాభవానీ, కామాక్షి, పద్మ, శ్రీకన్య, అన్నపూర్ణమ్మ సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు దావాల రమణారావు, వై.మన్మధరావు, గొర్రెల వెంకట రమణ, పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పారదర్శకంగా తయారు చేయాలి : పిఒ

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న పిఒ కల్పనాకుమారి

ప్రజాశక్తి - సీతంపేట

ఓటర్ల జాబితాను అత్యంత పారదర్శకంగా తయారు చేయాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి అన్నారు. మంగళవారం పాలకొండ నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఈనెల 21 నుంచి ఓటర్ల జాబితాలో తప్పులు, మరణించిన వారి పేర్లు తొలగించడం, పోలింగ్ బూత్‌లను సరిచేయడం, వేరే రాష్ట్రాలకు చెందిన వారి ఓట్లు తొలగింపు వంటి అన్ని రకాల లోపాలను సరిచేయనున్నట్టు తెలిపారు. ఈ సర్వేలో ఎటువంటి రాజకీయ పార్టీల ప్రమేయం ఉండకూడదన్నారు. కేవలం బిఎల్‌ఒలు, సంబంధిత సూపర్‌వైజర్లు మాత్రమే సర్వేలో పాల్గొనాల న్నారు. వాలంటీర్లు, ఎన్జీవోలు, ఇతర రాజకీయ పార్టీల వ్యక్తుల ప్రమేయం ఉండకూడదని పిఒ అన్నారు. బిఎల్‌ఒలు సర్వే చేసేటప్పుడు రాజకీయ పార్టీల ఏజెంట్లకు సమాచారం ముందుగానే ఇవ్వాలన్నారు. సర్వే షెడ్యూల్‌ను రాజకీయ పార్టీలకు అందజేయాలన్నారు. షెడ్యూల్‌ను తహశీల్దార్ కార్యాలయాల్లోనూ, సచివాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు. అలాగే వివిధ రాజకీయ పార్టీలు చెప్పిన అంశాలను పరిశీలిస్తామని అన్నారు. కొత్త పంచాయతీలకు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. బోగస్ ఓట్లు తొలగిస్తామని, ఒకే ఇంటి నెంబర్ మీద ఎక్కువ ఓట్లు ఉన్న అంశాన్ని పరిశీలించి వాటిని కూడా తొలగిస్తామని చెప్పారు. ఎన్నికలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు, ఇతర సమాచారం కోసం పాలకొండ నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు ఫోన్ నెంబర్ 9493083086కు ఫోన్ చేయొచ్చన్నారు. సమావేశంలో పాలకొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహశీల్దార్లు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్లు, ఎన్నికల ఆపరేటర్లు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న తోడు'కు రూ.10.22 కోట్లు

ప్రజాశక్తి - పార్వతీపురం

జగనన్న తోడు కింద జిల్లాలో 9,489 మంది లబ్ధిదారులకు రూ.10.22 కోట్లు ఆర్థిక సహాయం లబ్దిదారుల ఖాతాల్లో జమైంది. చిరు వ్యాపారుల ఉపాధికి ఊతం ఇచ్చే జగనన్న తోడు ఏడో విడత (వరుసగా నాలుగో ఏడాదిలో మొదటి విడత) ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని మంగళ వారం రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ ప్రాంతానికి చెందిన 7380 లబ్ధిదారులకు రూ.7.95 కోట్లు, పట్టణ ప్రాంతానికి చెందిన 2109 లబ్ధిదారులకు రూ.2.27 కోట్లు వెరసి 9489 మంది లబ్ధిదారులకు రూ.10.22 కోట్లు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్‌కుమార్, టిపిఎంయు ఎపిడి వై.సత్యం నాయుడు, లీడ్ బ్యాంక్ మేనేజర్ జె.ఎల్.ఎన్ మూర్తి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రైల్వే గేటు వద్ద బ్రిడ్జి నిర్మించాలి

ప్రజాశక్తి - బెలగాం

పట్టణంలోని బెలగాం వద్ద గల రైల్వే గేటు వద్ద అండర్ పాసేజ్ కానీ, ఫ్లైఓవర్ బ్రిడ్జ్ కానీ నిర్మించాలని రైల్వే డిఆర్‌ఎంకు రైల్వేబోర్డు సలహాకమిటీ సభ్యులు వారణాసి శ్రీహరి ఆధ్వర్యాన పట్టణ నాయకులు అందజేశారు. అనంతరం శ్రీహరి మాట్లాడుతూ ఈ సమస్యపై సోమవారం కలెక్టర్‌కు కూడా అందజేశామన్నారు. దీనికి డిఎం స్పందిస్తూ రాష్ట్రప్రభుత్వం అనుమతితోనే తాము ఏమైనా చేయగలమని, బ్రిడ్జిల నిర్మాణంలో తమకు ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. డిఆర్‌ఎంను కలిసిన వారిలో మరడాన తవిటి నాయుడు, జామి శ్రీనివాసరావు, పొట్నూరు పైడ్రాజు, గోళు పద్మావతి, వై.శ్రీనివాసనాయుడు, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.



డిఆర్‌ఎంకు వినతిని అందజేస్తున్న పట్టణ ప్రముఖులు

కాలుష్య నివారణకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

పర్యావరణాన్ని కాపాడేందుకు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కాలుష్య నియంత్రణకు జిల్లా పర్యావరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పర్యావరణ ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని, కావున పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కాలుష్యాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ సూచించిన ప్రమాణాల మేరకు సంబంధిత శాఖల అధికారులు, ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఇంటి నుంచి వచ్చే చెత్త, మున్సిపాలిటీలు, పంచాయతీలలో ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ చెత్త నిర్వహన, భవన నిర్మాణాలు, పాత ఇళ్లు పడగొట్టడం వల్ల వచ్చే మెటీరియల్, ఆసుపత్రుల నుంచి వచ్చే బయో మెడికల్, ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలు, పరిశ్రమలు నుంచి వచ్చే కాలుష్యం, నీటి నాణ్యతకు ప్రణాళిక, మురుగునీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు తదితర అంశాలపై ఈ నెలాఖరుకు జిల్లా పర్యావరణ ప్రణాళిక తయారుచేసి శాఖల వారీగా నివేదిక పంపాలని ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వాయు, శబ్ద కాలుష్యానికి సంబంధించి మొబైల్ ల్యాబ్ ద్వారా పట్టణంలో డాటా సేకరించాలన్నారు. గాలి నాణ్యత పరీక్షించేందుకు శాశ్వతంగా పాత బస్టాండు, ఆర్‌టిసి బస్టాండ్ల వద్ద పరికరాలు ఏర్పాటు చేయాలని కాలుష్య నియంత్రణ అధికారులను ఆదేశించారు. బయో మెడికల్ వ్యర్థాలను శాస్త్రీయంగా వేరుచేసి, ఆసుపత్రి ఆవరణలో నిల్వ చేసే ప్రదేశంలో కెమెరాలు అమర్చి వాటిని కాలుష్యనియంత్రణ మండలి వారికి పర్యవేక్షణ కోసం అనుసంధానం చేయాలని తెలిపారు. జిల్లాలో గల ఆసుపత్రులలో బయో వ్యర్థాల నిర్వహణ ఏర్పాట్లను, అనుమతులను తనిఖీ చేయాలన్నారు. ఆసుపత్రుల్లో రోజువారీ పడకల వివరాలు, వాటి వల్ల ఉత్పన్నమైన వ్యర్థాలను శాస్త్రీయంగా వేరు చేసి, తదుపరి వాటిని రెయిన్బో ఇండస్ట్రీ వారికి అందజేయాలన్నారు. వీటి వివరాలను కూడా ఆసుపత్రి వారు వెబ్సైటులో నమోదు చేయాలని ఆదేశించారు. బయో మెడికల్ వ్యర్థాలను మున్సిపల్ వ్యర్థాలతో జతచేయకుండా పర్యవేక్షించాలని వైద్యశాఖాధికారులకు సూచించారు. కాలుష్య నియంత్రణ బోర్డు ఇఇ ఎంవి పద్మావతి మాట్లాడుతూ మున్సిపాల్టీ, వైద్య ఆరోగ్య, గనులు పరిశ్రమల శాఖాధికారులు ప్రణాళిక తయారు చేయాలని కోరారు. దీనిలో భాగంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాన్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాన్, సి అండ్ డి వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాన్, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాన్ ప్రమాదకర వ్యర్థాల నిర్వహణ ప్రణాళిక, ఈ-వేస్ట్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాన్, నీటి నాణ్యత నిర్వహణ ప్రణాళిక, గృహ మురుగు నిర్వహణ ప్రణాళిక, పారిశ్రామిక మురుగునీటి నిర్వహణ ప్రణాళిక, ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ ప్లాన్, మైనింగ్ కార్యకలాపాల నిర్వహణ ప్రణాళిక, శబ్ద కాలుష్య నిర్వహణ ప్రణాళికలకు సంబంధిత శాఖలు నివేదికలు ఈనెల 25 నాటికి అందజేయాలన్నారు. సమావేశంలో డిపిఒ బి.సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఒ.ప్రభాకరరావు, మున్సిపల్ కమిషనర్లు జె.రామప్పలనాయుడు, ఫరీరురాజు, ఇరిగేషన్ ఎస్ఇ, డిప్యూటీ డిఎంహెచ్, భూగర్భ గనులు, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

మూర్ఛతో చెరువులో పడి విద్యార్థిని మృతి

శ్రావణి (ఫైల్)

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బూర్జ పంచాయతీ ఆవాలవలస గ్రామానికి చెందిన ఆవాల శ్రావణి (14) మూర్ఛ రావడంతో చెరువులో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు మేరకు ఆవాల శ్రావణి గాదిలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. ఎప్పటిలాగే మంగళవారం సైకిల్‌పై పాఠశాలకు వెళ్తుండగా మార్గ మధ్యలో ఫిట్స్ రావడంతో చెరువులో పడింది. ఈ విషయం గమనించిన వేరే విద్యార్థిని కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. దీంతో స్థానికులు, కుటుంబ సభ్యులు చెరువులో దిగి వెతకడంతో అప్పటికే శ్రావణి మృతి చెందింది. ఒక్కగానొక్క కుమార్తె మరణించడంతో ఆమె తల్లిదండ్రులు సత్యం, పార్వతి కన్నీరుమున్నీరై రోధించారు. ప్రోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న సురక్షతో ప్రజలందరికీ మేలు

డిప్యూటీ సిఎం రాజన్న దొర

పాచిపెంటలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రజల కష్టాలను తెలుసుకొని, వారికి కావాల్సిన ధ్రువపత్రాలు ఉచితంగా అందించడమే కాకుండా అర్హత కలిగిన ప్రతి ఒకర్ని గుర్తించి సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్యోద్దేశమని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర తెలిపారు. మంగళవారం స్థానిక మినీ గురుకులం ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రజలకు మేలు చేసేందుకు, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్యోయద్దేశమన్నారు. జగనన్న సురక్ష ప్రజలకు ఒక వరం అని అర్హత ఉండి పథకాలు పొందలేని వారికి ఒక అవకాశంగా నిలుస్తుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జీ, నాయకులు టి.గౌరీశ్వరరావు, దండి ఏడుకొండలు, ఇజ్జాడ అప్పలనాయుడు, వైస్ ఎంపిపి మీసాల నారాయణ, ఎంపిడిఒ జి.పార్వతి, తహశీల్దార్ రాజశేఖర్, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు

పిల్లలు ఆరోగ్యంపై దృష్టి పెట్టండి

జగనన్న సురక్ష కార్యక్రమంలో అనంతరం రాజన్నదొర మినీ గురుకులాన్ని డిప్యూటీ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినీలతో మమేకమయ్యారు. ముఖ్యంగా చదువుపై దృష్టి సారించాలని సూచించారు పిల్లలు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. సమస్యలను నివారణకు విద్యే ప్రధానమైందన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

భామిని : మండలంలోని పెద్దదిమిలి, బూరుజోల సచివాలయం ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం సచివాలయం ద్వారా ఉచితంగా మంజూరు చేసే ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, తహశీల్దార్ అప్పారావు, ఎంపిడిఒ చంద్రరావు, సర్పంచులు తోఘరానా శ్రీను, పాశర్ల రామారావు, మడపానా కేశవ, బెవర భార్గవనాయుడు, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలం తెట్టంగిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాలకొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు పి.లక్ష్మణరావు పాల్గొన్నారు. అలాగే నడిమికెళ్లలో సర్పంచ్ డి.సుజాత ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ అలజంగి విజయమ్మ, పి.పరిశినాయుడు, సతివాడ చిన్నంనాయుడు, తహసిల్దార్ సిహెచ్ సత్యనారాయణ, ఎంపిడిఒ జి.జయంతిప్రసాద్, సచివాలయ కార్యదర్శులు ఎన్.కోటి, బంగారు బాబు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీతంపేట : మండల కేంద్రమైన సీతంపేటలో ఎంపిపి బి.ఆదినారాయణ ఆధ్వర్యంలో స్థానిక సామాజిక భవనంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 207మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మోహన్ రావు, సర్పంచ్ కళావతి, వైస్ ఎంపిపి కె.సరస్వతి, ఎంపిటిసి పగడాలమ్మ, కార్యదర్శి బి.సుదర్శనరావు, విఆర్‌ఒలు సుబ్బారావు, వైసిపి నాయకులు పాలవలస ప్రకాశరావు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

సాలూరు: పట్టణంలోని రామా కాలనీలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర అర్హులైన వారికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. జెసిఎస్ కన్వీనర్ గిరి రఘు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో రాజన్నదొర మాట్లాడుతూ ఇంకా సంక్షేమ పథకాలు అందని పేదలు స్థానిక నాయకులు, కౌన్సిలర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తాడి రమణ, మేకల శంకరరావు, పున్నాన మోహన్ రావు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని వెంగాపురం, తుమరాడలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు జారీ చేసిన 11రకాల ధ్రువపత్రాలను లబ్దిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి గుడివాడ నాగమణి, వైస్ ఎంపిపిలు వెలిది సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యులు అలజంగి రవికుమార్, మండల పార్టీ అధ్యక్షులు పి.మురళీకృష్ణ, స్థానిక సర్పంచ్ జి. అమ్మడమ్మ, కిల్లాడ కనకమహాలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు గులిపిల్లి మురళీ, తహశీల్దార్ అప్పలరాజు, ఎంపిడిఒ విజయలక్ష్మి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి సీనియర్‌నాయకులు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైసిపిలో మళ్లీ గ్రూపు రాజకీయాలు

జగనన్న సురక్షకు ఎంపిపి సహా సీనియర్ల డుమ్మా
జనం లేకపోయినా డిప్యూటీ సిఎం హాజరు

ప్రజాశక్తి - సాలూరు

పాచిపెంట మండలంలో వైసిపిలో మళ్లీ గ్రూపు రాజకీయాలు బుసకొడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. గత కొంతకాలంగా నివురు కప్పిన నిప్పులా ఉన్న గ్రూపు రాజకీయాలు ఇప్పుడు తెరమీదకు వస్తున్నాయి. సీనియర్ నాయకులు, డిసిసిబి డైరెక్టర్ డోలు బాబ్జీ, ఎంపిపి బి.ప్రమీల గ్రూపుల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం మొదలైంది. మంగళవారం పాచిపెంటలో రెండు సచివాలయాలకు సంబంధించిన జగనన్న సురక్ష కార్యక్రమం స్థానిక మినీ గురుకుల పాఠశాలలో నిర్వహించారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర హాజరైన ఈ కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల, మండల పార్టీ అధ్యక్షులు గొట్టాపు ముత్యాలు నాయుడు, సీనియర్ నాయకులు సలాది అప్పల నాయుడు, పాచిపెంట చినబాబు, వైస్ ఎంపిపి రవీంద్రకుమార్ కనిపించలేదు. డిసిసిబి డైరెక్టర్ డోల బాబ్జీ కనుసన్నల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం, ఆయన బిసి నాయకుల పట్ల చులకన భావంతో వ్యవహరించడం వల్ల మిగిలిన సీనియర్ నాయకులు గైర్హాజరైనట్లు తెలుస్తోంది. రాజన్నదొర హాజరైన కార్యక్రమంలో చాలా తక్కువ మంది హాజరవడం చర్చనీయాంశమైంది. ఈ సమావేశంలో ఎక్కువగా కుర్చీలు ఖాళీగా కనిపించాయి. సీనియర్ నాయకులు డోల బాబ్జీ అనారోగ్యం నుంచి కోలుకున్న తర్వాత మండల రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించడం, మునుపటి వలె తన ఆధిపత్యాన్ని నిరూపించుకునే ప్రయత్నాలు మొదలు పెట్టడంతో సీనియర్ నాయకులు కినుక వహించినట్లు తెలుస్తోంది. మండలంలోని చాలా గ్రామాల్లో జగనన్న సురక్ష సభలను విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించిన సీనియర్ నాయకులు పాచిపెంట మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి గైరుహాజరవడం గ్రూపు రాజకీయాలకు అద్దం పట్టింది. మండల రాజకీయాల్లో తిరిగి పూర్వపు పరిస్థితులు కనిపిస్తాయనే చర్చ మొదలైంది. మరో ఆరునెలల్లో ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో అధికారపార్టీలో నెలకొన్న గ్రూపు రాజకీయాలు డిరాజన్నదొరకు తలనొప్పి కానున్నాయి.

ప్రజాశక్తి
www.prajasakti.com

వ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యాధులు ప్రభల్లే అవకాశం ఉందని, వీటిని దృష్టిలో పెట్టుకుని అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు జి.ప్రదీప్ కుమార్, పి.ఉమామహేశ్వరి వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తరచుగా గ్రామాలు సందర్శించాలన్నారు. ఎక్కడైనా జ్వరాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామస్తుల నుండి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు ,ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఎమ్మెల్యేను కలిసిన ఎస్‌టి కమిషన్ చైర్మన్

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

రాష్ట్ర గిరిజన కమిషన్ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ డివిజి శంకరరావు మంగళవారం పార్వతీపురం విచ్చేసిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావును ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యాలయానికి విచ్చేసిన చైర్మన్‌ను ఎమ్మెల్యే సాధారణంగా ఆహ్వానించి, దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి, ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కమిషన్ చైర్మన్‌ను కోరారు. దీనికి ఆయన స్పందిస్తూ పార్వతీపురం ఎంపిగా పనిచేసిన తనకు గిరిజన సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, ఉత్తరాంధ్రలోని ఐటిడిఎలను బలపర్చి కేంద్రం, రాష్ట్ర నిధులతో గిరిజనులకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కలిగేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సిద్ధా జగన్నాధరావు, నాయకులు గుర్రాజు, రణభేరి చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు సిద్ధం

ప్రజాశక్తి - సాలూరు

తమ సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు దిగుతామని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు టి.రాముడు, కార్యదర్శి టి.శంకరరావు చెప్పారు. మంగళవారం వారు దశలవారీ పోరాటానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 20 నుంచి దశలవారీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు తమకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు టి.రవి, టి.శ్రీను పాల్గొన్నారు.

చదువే విద్యార్థుల ప్రధాన లక్ష్యం కావాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

విద్యార్థులకు చదువే ప్రధాన లక్ష్యం కావాలని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సాంఘిక సంక్షేమశాఖ బాలికల కళాశాల వసతి గృహంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులుగా మన బతుకులు మార్చుకోవాలంటే చదువు ఒక్కటే పరిష్కారమని తెలిపారు. చక్కగా చదువుకోవడం ద్వారా ఉపాధితో పాటు మంచి పౌరులుగా తయారౌతారని అన్నారు. జెవివి జిల్లా అధ్యక్షులు ఎం.రత్నకుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ పట్ల విద్యార్థులకు అవగాహన ఉండాలని సూచించారు. ఇంటర్మీడియట్, డిగ్రీ దశలో చాలా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు గంగాధర్రావు, సంతోష్, చంద్ర మౌళి తదితరులు ప్రసంగించారు. ఈ సదస్సుకు జెవివి రాష్ట్ర కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అధ్యక్షత వహించారు.

వైద్యాధికారి నుంచి వివరణ తీసుకుంటున్న విచారణాధికారి భాస్కరరావు

వైద్యాధికారిపై విచారణ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర పిహెచ్‌సి వైద్యాధికారి రఘుకుమార్‌పై అదే గ్రామానికి చెందిన రెండో ఎఎన్ఎం తనను లైంగికంగా వేధిస్తున్నారంటూ కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదుపై మంగళవారం విచారణ జరిగింది. ఆర్‌బి ఎస్‌కెపిఒ దవళ భాస్కరరావు విచారణ చేపట్టారు. ఈనెల 10న జగనన్నకు చెబుదాంలో ఎఎన్ఎం చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పందించి జిల్లా వైద్యాధికారిని విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం విచారణాధికారి ఇరువురు నుంచి లిఖితపూర్వక వాంగ్మూలాలు తీసుకున్నారు. అలాగే స్థానిక సిబ్బందిని ఇరువురి మనస్తత్వాలపై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ విచారణలో రాబట్టిన అంశాలు జిల్లా అధికారులకు నివేదిస్తామని భాస్కరరావు తెలిపారు

గిరిజన గ్రామాల్లో స్ప్రేయింగ్

ప్రజాశక్తి -సీతంపేట

మండలంలోని ఆరోగ్య కేంద్రం పరిధిలో దోనుబాయి, కిల్లాడ, పెద్దపొల్ల, టిటికిపాయి తదితర గ్రామాల్లో మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహనరావు ఆధ్వర్యంలో స్ప్రేయింగ్ చేశారు. అనంతరం ఈ గ్రామాల్లో ఫాగింగ్ చేశారు. దోమలను నివారించడానికి ఫాగింగ్ పూర్తిస్థాయిలో చేశారు. యాంటీ లార్వా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి భాను ప్రతాప్ మాట్లాడుతూ రోగాలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గిరిజనులకు జ్వరాలపై సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. దోమతెరల వాడకంపై అవగాహన కల్పించాలన్నారు.

నిర్మాణ పనుల జాప్యంపై ఆగ్రహం

ప్రజాశక్తి - వీరఘట్టం

సచివాలయాల భవన నిర్మాణ పనుల జాప్యం పట్ల జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎంవిఆర్‌జి కృష్ణాజీ ఇంజనీరింగ్ సహాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరు సహాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలంలో సచివాలయాల భవనాల నిర్మాణ పనులు వెనుకబాటులో ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి నిధులు కూడా కొరత లేవన్నారు. మీరు ఏం చేస్తారో తెలియదు? ఈ సెప్టెంబర్ 15లోగా 12 సచివాలయాలు, 10 రైతు భరోసా కేంద్రాలు, ఏడు వైయస్సార్ హెల్త్ క్లినికుల పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎం బుక్ లు కూడా మీరే నమోదు చేయాలన్నారు. బాధ్యతగా పని చేయాలని, నిర్ణీత సమయానికి భవనాలు అప్పగించకపోతే జీతాలు నిలుపుదలతో పాటు శాఖాపరమైన చర్యలు కూడా తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఇ లోకనాథం, జెఇ డి.కల్యాణ దుర్గ, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతీరాజ్‌శాఖ అధికారి కృష్ణాజీ

సాగుతూ... ఉన్నా

నాడు -నేడు పాఠశాల పనులు

గంగన్నదొరవలసలో పునాదులైన లేవని పాఠశాల భవనం

ప్రజాశక్తి - సాలూరురూరల్

నాడు-నేడు కింద చేపడుతున్న పాఠశాలల పనులను వేసవి సెలవుల అనంతరం స్కూళ్ల పున: ప్రారంభానికి పనులు పూర్తి చేయాలని రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకూ గుత్తేదారులకు, కిందస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే జిల్లాలో ఎక్కడా ఒక్క పాఠశాలను కూడా పూర్తిచేసి అప్పగించిన పాపాన లేదు. ఈఏడాది విద్యా సంవత్సరం ప్రారంరంభమై నెలరోజులు పూర్తి అయినా పలుచోట్ల పనులను పునాదులకు పరిమితమయ్యాయి. మరో పక్క కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా సర్కారు బడులో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పిస్తామంటున్న ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. పాఠశాలల పనులు పూర్తి చేయకపోవడంతో విద్యార్థులు అసౌకర్యాల నడుమ విద్యను కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సరిపడా ఉపాధ్యాయులున్నా భవనాల కొరతతో సరైన వసుతుల్లేక విద్యార్థుల ఇబ్బందులు వర్ణణాతీతం.

మండలంలో సుమారు 86 పాఠశాలల్లో మొదటి విడతగా 45పాఠశాలలకు నాడు నేడు కింద నూతన భవన నిర్మాణాలు, మరమ్మతులు, మంచినీరు, విద్యుత్ సౌకర్యం, కుర్చీలు బల్లలు అన్ని రకాలుగా పనులను ప్రారంభించి పూర్తిచేశారు. అయితే రెండో దశలో మిగిలిన 41 పాఠశాలలకు నాడు-నేడు కింద నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులతో అన్ని పాఠశాలలకు అవసరమైన భవనాలు, మరమ్మతులు, మంచినీటి కోసం బోర్లు, బాతు రూమ్‌లు చేయించేయిందుకు విద్యాకమిటీ, ప్రధానోపాధ్యాయులు కలిసి పనులు మొదలు పెట్టారు. అంత వరకు బాగానే ఉంది. పనులు మొదలు పెట్టి నేటికీ ఐదు నెలలు కావస్తున్నా 41 పాఠశాలలో ఒక్కటి కూడా నేటికి పూర్తి కాలేదు. ఈ నిర్మాణాలకు ప్రభుత్వం కూడా అరకొరగా నిధులు మంజూరు చేస్తుండడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ముఖ్యంగా గిరిజన గ్రామాలైన మర్రిపల్లి, గంగన్న దొరవలస,

గంగన్నదొరవలసలోని ఇళ్లలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయరాలు

వెలగవలసలోని జీడిపిక్కల గోడౌన్లో చదువుతున్న విద్యార్థులు

వెలగవలసలో పాడుబడిన తరగతి గదులను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో నూతన భవన నిర్మాణాలను ప్రారంభించారు. అయితే వాటి పనులు నేటికీ పునాదులకే పరిమితమవ్వడంతో ఈ పాఠశాలల్లో సుమారు వంద మంది విద్యార్థులు గ్రామస్తుల సహకారంతో గంగన్నదొరవలసలో మూడు ఇళ్ల గడపల్లోనూ, వెలగవలసలోని జీడిపిక్కల గౌడౌన్ల పాఠాలను బోధిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు జీవన్‌కుమార్ తెలిపారు. గతంలో ఈ పాఠశాలలో పనిచేసిన ప్రధానోపాధ్యాయుడి పేరున ఖాతా ఉండడం, తాను కూడా వచ్చి నెల రోజులు గడుస్తున్న ఆ ఖాతాను తనకు బదిలీ చేయకపోవడంతో నిధులు ఎంత మంజూరయ్యాయి, ఇంకా ఎంత మిగిలాయి అన్న విషయం తెలియలేదని, ఖాతాను మార్చిన వెంటనే పనులను మొదలు పెడతామని ఆయన తెలిపారు. ఇదే విషయం పై పాఠశాల కమిటి చైర్మన్ తొత్తడి పరసన్నదొరతో మాట్లాడగా పాత భవనంను తొలగించి సుమారు పది నెలలు కావస్తున్నా పనులు పునాదులు వరకే పరిమితమయ్యాయి. దీంతో తమ పిల్లలు ఎక్కడ కూర్చొని చదువుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. గ్రామంలో మూడు ఇళ్ల దగ్గర గడపల్లో తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పాఠశాల పనులు ఎందుకు నత్తనడకన జరుగుతున్నాయో తెలియన పరిస్థితి అని అన్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పనులు మొదలు పెట్టాలని కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలు చేస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

ఫ్యామిలీ డాక్టర్ విధానం పక్కాగా అమలు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఫ్యామిలీ డాక్టర్ విధానం పక్కాగా అమలు చేయాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ అన్నారు. మండలంలోని బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లు, ఒపి యూనిట్, జనరల్ వార్డ్, డ్రగ్స్ స్టోర్, శానిటేషన్‌ను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. రోగులతో మాట్లాడి వారికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. అనంతరం నర్సిపురంలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పరిశీలించారు. ఫ్యామిలీ డాక్టర్ శిబిరం ఆదర్శప్రాయంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి వారికి ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం అందుతుందో లేదో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను పరిశీలించి, పనులను త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారులను పిఒ ఆదేశించారు. అనంతరం నర్సిపురంలోని 1,2 అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించి పిల్లలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అంగన్వాడీ కార్యకర్తను ఆదేశించారు. వారికి అవసరమైన వస్తువులను అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం ఐటిడిఎ కార్యాలయంలో జల జీవన్ మిషన్, ఇతర పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్. డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఎల సమస్యలపై దశలవారీ ఆందోళనలు

ప్రజాశక్తి - కురుపాం

విఆర్ఎల సమస్యల పరిష్కారానికై దశల వారీ చేపడుతున్న ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని విఆర్ఎల సంఘ జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పే స్కేలు అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారందర్నీ విఆర్ఎలుగా నియమించాలని, అర్హులకు విఆర్ఒలుగానూ, అటెండర్, వాచ్మెన్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, డిఎ రికవరీ నిలిపివేసి డిఎతో కూడిన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం దశల వారీ ఆందోళన చేయాలని ఎపి గ్రామ రెవెన్యూ సహాయక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని, కావున ఈ కార్యక్రమాన్ని విఆర్ఎలంతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యమ కార్యక్రమంలో భాగంగా ఈనెల 20,21న మండల కేంద్రాలతో దీక్షలు, ఆగష్టు 7, 8 తేదీల్లో కలెక్టరేట్ల వద్ద దీక్షలు, ఆగష్టు 23, 24 తేదీల్లో విజయవాడలో రాష్ట్ర స్థాయి దీక్షలు, ఆగష్టు 25న జగనన్నకు నేరుగా చెబుదాం చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. వీటిలో విఆర్ఎలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రోడ్డుపై వర్షం నీరు

ప్రజాశక్తి - సీతంపేట

మండల కేంద్రమైన సీతంపేట దళితవీధిలోని సిసి రోడ్డుపై వర్షం నీరు ప్రవహించడంతో కాలనీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై నీరు ప్రవహించడంతో ఇళ్లల్లోకి నీరు వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై నడిచి వెళ్లలేని పరిస్థితి నెలకొందని, చెరువును తలపిస్తుంది. కాలువల్లో నీరు వెళ్లకపోవడమే కారణమని, తక్షణమే కాలువ ద్వారా నీరు వెళ్లాలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు శ్రీనివాసరావు, రామచంద్రరావు, మురళీకృష్ణ, కుమార్ తదితరులు కోరారు.

వర్షాలకు జలమయమైన పార్వతీపురం మెయిన్‌రోడ్డు

ఏకధాటిగా కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో మంగళవారం తెల్లవారుజాము నుండి వర్షం ఏకధాటిగా కురుస్తుండడంతో పనులపై బయటికి వచ్చేందుకు ప్రజలు నానా అవస్థలు పడ్డారు. కురుస్తున్న వర్షం కారణంగా ప్రధాన రహదారిలో జనసంచారం లేకపోవడంతో పుట్‌పాత్ వ్యాపారులు, తోపుడుబండ్ల వర్తకులు తమ వ్యాపారాలు జరగక ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే పార్వతీపురం పట్టణ పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయదారులు కురుస్తున్న వర్షంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

వీరఘట్టం: మండలంలోని మంగళవారం వేకువ జాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. మొన్నటి వరకు ఎండల ప్రభావం కారణంగా వరి నారుమల్లు ఎండిపోతున్నాయని, అన్నదాతల్లో ఆవేదన మొదలయ్యింది. కురుస్తున్న వర్షాలు కారణంగా నారుమడుల్లో నీరు చేరడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతం కంటే ఈ ఏడాది మండలంలోని 3 వేల ఎకరాల్లో అన్నదాతలు ఎదల చల్లినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వ్యవసాయంపై పెట్టుబడులు తగ్గించుకునేందుకు వీలుగా ఎదల చల్లుకున్నట్లు అన్నదాతలు చెబుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు పొలం పనుల్లో బిజీగా ఉంటున్నారు.

ప్రజారోగ్యంపై దృష్టిసారించాలి : డిఐఒ

ప్రజాశక్తి - సీతంపేట

ప్రజారోగ్యంపై దృష్టి సారించి అన్ని ఆరోగ్య కార్యక్రమాలు పూర్తి స్థాయిలో అమలు జరిగేలా వైద్య సిబ్బంది చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) టి. జగన్మోహనరావు సూచించారు. మండలంలోని దోనుబాయి, కుసిమి పిహెచ్‌సిలను, స్థానిక ఏరియా ఆస్పత్రిలో గల ఎన్ఆర్‌సి (పోషకాహార పునరావాస కేంద్రం) కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. పిహెచ్‌సిల్లో సిబ్బంది హాజరు, ఒపి రికార్డ్, ఎటువంటి అనారోగ్య లక్షణాలు నమోదు అవుతున్నవి, ల్యాబ్ పరీక్షలు, మందుల నిల్వలు, వ్యాక్సిన్ నిల్వలు, వార్డు, ప్రసూతి గది తదితర అంశాలను పరిశీలించారు. సంబంధిత సేవల రికార్డుల నమోదు,ఆన్లైన్ నమోదుపై సిబ్బందిని ఆరా తీశారు. సూపర్ వైజర్లు విధిగా క్షేత్ర స్థాయిలో పర్యటించి, ప్రతి ఆరోగ్య కార్యక్రమం సక్రమంగా అమలు జరిగేలా ప్రత్యక్ష పర్యవేక్షణ చేసి ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఆరోగ్య కార్యక్రమానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని వైద్య సిబ్బంది అంతా ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలని సూచించారు. ప్రగతి నివేదికలు పురోగతి చెందాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం అక్కడ రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రస్తుతం జరుగుతున్న టీకా కార్యక్రమానికి సంబంధించి మిషన్ ఇంద్ర ధనుష్ సర్వే పై సిబ్బందిని ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా అన్ని గ్రామాల్లో అవసరమైన మందులు, పరీక్షలు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం ఎన్ఆర్‌సి కేంద్రాన్ని డిఐఒ సందర్శించి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వెంకటరావుతో కలిసి అక్కడ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారుల ఆరోగ్య పర్యవేక్షణ చేశారు. బరువు తక్కువగా, పోషకాహార లోపం గల పిల్లలు పూర్తి స్థాయిలో ఆరోగ్య వృద్ధి చెందిన తర్వాతే డిశ్చార్జ్ చేయాని సిబ్బందికి సూచించారు. ప్రతినెలా చేరుతున్న అవుతున్న పిల్లల జాబితా రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఎన్ఆర్సి వైద్యాధికారి డాక్టర్ సుధీర్ కుమార్, వైద్యాధికారులు డాక్టర్ ఎస్.భానుప్రతాప్, బి.రవీంద్ర, సూపర్ వైజర్లు ప్రమీలారాణి, నిర్మలకుమారి, జయగౌడ్, రాజారావు, గంగమ్మ, దమయంతి, సీతారామరాజులు, వెంకటేశ్వర్లు వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

పిల్లల తల్లిదండ్రులకు సూచనలు ఇస్తున్న డిఐఒ జగన్మోహనరావు

గిరిజన హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల హక్కులను కాలరాస్తున్నాయని గిరిజన సంఘం నాయకులు కోరంగి సీతారాం అన్నారు. జియ్యమ్మవలస మండల కేంద్రంలో గల ప్రజాసంఘాల కార్యాలయంలో గిరిజన సంఘం మండల మహాసభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ గిరిజన యువతకు ఉద్యోగాలు వచ్చే జిఒ 3ను సుప్రీంకోర్టు రద్దు చేస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం పట్టించుకోలేదన్నారు. బోయ వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చి గిరిజనులకు జగన్మోహన్ రెడ్డి అన్యాయం చేస్తున్నారని, 1/70 చట్టాన్ని రద్దుచేసి గిరిజన ప్రాంతాన్ని మైనింగ్ పేరుతో కార్పొరేట్ పెట్టుబడుదారులకు అప్పజెప్పడానికి చూస్తున్నారని అన్నారు. అలాగే గిరిజన ప్రాంతంలో హైడల్ విద్యుత్ ప్రాజెక్టులు మంజూరు చేసి గిరిజనుల ఉనికి లేకుండా చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టులన్నీ అదానీ కంపెనీకి అప్పజెప్పారన్నారు. ఈ విధానాలన్నింటిపై గిరిజనులంతా ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటాలకు వేదికగా గిరిజన సంఘం జిల్లా 7 వ మహాసభలు కురుపాంలో జరుగుతున్నాయని, ఆ మహాసభలలో గిరిజనులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం గిరిజన సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అడ్డాకుల రామారావు, కార్యదర్శిగా గోరపాడు సోమయ్య, కమిటీ సభ్యులుగా కొండగొర్రె సుబ్బారావు, మండంగి కాంతారావు, హిమరక ప్రసాద్, మెల్లక సుమన్, ఎలకల అనసూర్యమ్మ, కొండగొర్రె గుంప స్వామి, కూరంగి సీతారాం, బిడ్డిక వెంకట్రావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగు నాయుడు పాల్గొన్నారు.

రైతుకు భరోసా ఇవ్వలేని కేంద్రాలు ఎందుకు?

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

రైతుకు భరోసా ఇవ్వలేని రైతు భరోసా కేంద్రాలు ఎందుకని జనసేన నాయకులు ప్రశ్నించారు. మంగళవారం ఎమ్మార్ నగరంలో గల రైతు భరోసా కేంద్రాన్ని జనసేన నాయకులు వి.దాలి నాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రానికి చెందిన విఎఎ సీర బాలకృష్ణతో రైతు భరోసా కేంద్రంలో రైతులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది రైతులు అత్యధికంగా సంపత్ స్వర్ణ -130 రకం వరి విత్తనాలను కోరితే రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం వాటిని సరఫరా చేయలేదన్నారు. అధిక దిగుబడి, చీడపీడలను, నీటివసతిని తట్టుకొని, తక్కువ రోజుల్లో పంట చేతికొచ్చే రకాన్ని రైతులు కోరుకుంటే, ప్రభుత్వం మాత్రం 1064, సాంబ మసూరి, బిపిటి 5204, బి పి టి 3291 రకాలు సరఫరా చేసిందన్నారు. దీంతో రైతులు బయట మార్కెట్లో అధిక ధరలకు కావాల్సిన విత్తనాలు కొనుక్కున్నారన్నారు. అలాగే రైతులు యూరియాతో పాటు డి ఎ పి, పొటాస్, 28-28, 20-20, 14-35, 0-35, తదితర ఎరువులు కోరుతున్నారన్నారు. కానీ ఇంతవరకు రైతు భరోసా కేంద్రాలు ఆయా ఎరువుల పట్ల రైతులకు భరోసా ఇవ్వలేదన్నారు. ఇక కష్టమ్ హైరింగ్ కేంద్రాల ద్వారా వ్యవసాయ యాంత్రీకరణకు భరోసా కల్పిస్తున్నామన్న భరోసా కేంద్రాలు ఆ మేరకు భరోసా ఇవ్వలేకపోతున్నాయన్నారు. రైతులు కోరిన విత్తనాలు, ఎరువులు పురుగుమందులు స్టాండర్డ్ కంపెనీలవి అందించాలన్నారు. అలాగే ఆర్‌బికె భవనాలు నిర్మాణాలు పూర్తి కాకపోవటంతో ఇరుకు గదుల్లోనూ, అద్దెకొంపల్లో నిర్వహించాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి ఆరుగాలం శ్రమించి అందరికీ తిండి పెట్టే రైతుకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ఆదుకోవాలని కోరారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఎన్నికలు ఎప్పుడు జరిగినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, అలాగే ఈనెల 21 నుంచి ఓటర్ల తనిఖీ కార్యక్రమానికి ప్రతి ఒక్క బూత్ ఇన్చార్జి బిఎల్‌ఒలను అనుసరించి హౌస్ మ్యాపింగ్ చేయాలని టిడిపి కురుపాం నియోజకవర్గ ఇంచార్జి తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ ప్రోగ్రాం మంగళవారం నిర్వహించారు. మండలంలోని 52 మంది బూత్ ఇన్చార్జిలు, ఏడుగురు యూనిట్ ఇన్‌ఛార్జిలు, ఇద్దరు క్లస్టర్ ఇన్చార్జీలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వీరినుద్దేశించి ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టో ప్రజల వద్దకు తీసుకెళ్లాలన్నారు. మేనిఫెస్టో ద్వారా ప్రతి కుటుంబానికి రూ.లక్షా22వేలు అందుతుందని ఆ విషయాన్ని ప్రజల వద్దకు తీసుకువెళ్లాలని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు పాడి సుదర్శన్ రావు, పోల్ మేనేజ్మెంట్ పోలూరు శ్రీనివాసరావు, యూనిట్ క్లస్టర్ ఇన్చార్జిలు, టిడిపి నాయకుల వీరేష్ చంద్ర దేవ్ హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్వరి

ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వం ప్రవేశపెడు తున్న సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆదేశించారు. మండలంలోని రెల్ల, పెద్దఖర్జ గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ముందుగా రెల్లలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించి ఆ కుటుంబానికి చేయూత గా నిలవాలని అన్నారు. ప్రభుత్వ పథకాలతో ఆర్థికంగా అభివద్ధి చెందాలనేదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రతి గ్రామంలో అర్హులుగా ఉన్న వారిని గుర్తించి సంక్షేమ పథకాలు అందకుంటే తక్షణమే అందించాలని సూచించారు. అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం పెద్దఖర్జలో భూముల రీ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా రీసర్వే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జె.రాములమ్మ, ఇఒపిఆర్‌డి జగదీష్ కుమార్, ప్రసాద్ ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - బలిజిపేట

ఎరువుల దుకాణాలు, అనధికార నిల్వలను మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అధికారి ఆర్.అప్పలనాయుడు, మండల వ్యవసాయశాఖ అధికారి శ్రావణ్ కుమార్ పి.రావివలసలో తనిఖీలు చేయగా, అక్రమంగా అమ్ముతున్న ఎరువులను (రూ.2,70,282) స్టాక్‌ను సీజ్ చేసి 6-ఎ కేసు నమోదు చేశారు. అలాగే మండలంలోని కొత్తకోట సతీష్ కుమార్ ఎరువుల దుకాణంలో సరైన రికార్డుల్లేక పోవడంతో జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు పార్వతీపురం సహాయ వ్యవసాయ సంచాలకులు టి. వెంకటేసు, పార్వతీపురం ఎఒ అశోక్, బలిజిపేట ఎఒ తనిఖీ చేశారు. ఈ తనిఖీలో రూ.28,994 విలువైన స్టాక్ గల యూరియా ఎరువును అమ్మకాలు జరపకుండా నిల్వ చేసినట్లు అధికారులు తెలిపారు.

అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు